

ఏయూలో అత్యుత్తమ ప్రమాణాలు

ఏయూను అంతర్జాతీయ ప్రమాణాలతో నాలుగేళ్లుగా అభివృద్ధి చేస్తున్నామని వీసీ ప్రసాదరెడ్డి వెల్లడించారు. 8లో



వసతి దీవెనకు వేళాయె..!

ఐటీఐ, పాలిటెక్నిక్, ప్రొఫెషనల్ కోర్సులతో పాటు, డిగ్రీ ఆపై చదువులు సాగిస్తున్న వారికి నేడు జగనన్న వసతి దీవెన అందనుంది. 8లో



డబ్ల్యూటీసీకు భరత్

ప్రపంచ టెస్ట్ క్రికెట్ చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) టైటిల్ పోరులో భారత్ జట్టు వికెట్ కీపర్‌గా భరత్ ఎంపికయ్యాడు. 8లో

న్యూస్‌రీల్

కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవోగా శిరీష



దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష నియమితులయ్యారు. ఇంతవరకూ ఈవోగా విధులు నిర్వహిస్తున్న కె.రమేష్‌నాయుడు కృష్ణాజిల్లా తిరుపతమ్మ దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. సహాయ కమిషనర్ బాధ్యతలతో పాటు కనకమహాలక్ష్మి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలను శిరీష నిర్వహించనున్నారు. గతేడాది జూలై ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 29వరకు ఆమె కనకమహాలక్ష్మి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆలయ ఆదాయం పెంపు, భక్తులకు సౌకర్యాలతో పాటు అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు నిర్వహించి అందరి ప్రశంసలు పొందారు. ముఖ్యంగా అమ్మవారి దత్తత దేవాలయం అంబికాబాగ్ రామచంద్రస్వామి దేవస్థానం ఆస్తులు, అనకాపల్లిలో అన్యాక్రాంతం కాగా వాటిని స్వాధీనం చేసుకొని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. దీంతో శిరీషాను అమ్మవారి దేవస్థానం ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకట్రెండు రోజుల్లో శిరీష ఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఏయూ అధికారులతో ఎస్టీ కమిషన్ చైర్మన్ భేటీ



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ ఆలుమ్ని సమావేశ మందిరంలో వర్సిటీ అధికారులు, ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఏయూలో బోధన, బోధనేతర ఉద్యోగాల భర్తీలో రోస్టర్ అమలు చేస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. వర్సిటీ, అనుబంధ కళాశాలల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తున్న విధానంపై సమగ్ర నివేదికను రెండు వారాల్లో అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు వి.శంకర్‌నాయక్, కొర్ర రామలక్ష్మి, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎస్టీ కమిషన్ కార్యదర్శి, ఓఎస్డీ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల వేలం నేడు

మద్దిపాలెం: వివిధ నేరాల్లో పట్టుబడిన పలు వాహనాలకు బుధవారం బహిరంగ వేలం వేయనున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఇన్‌స్పెక్టర్ సీహెచ్‌వీ ఎస్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. మురళీనగర్‌లో ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని గోపాలపట్నం సర్కిల్–4 కార్యాలయంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనదలచినవారు తగిన రుసుము చెల్లించి ఆధార్ కార్డును సమర్పించాలని సూచించారు. వివరాలకు 94409 02382 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

శనివారమూ అందుబాటులో పాస్‌పోర్టు సేవలు

మురళీనగర్(విశాఖ ఉత్తర): ప్రస్తుతం పాస్‌పోర్టులకు ఉన్న భారీ డిమాండ్ దృష్ట్యా పాస్‌పోర్టు కార్యాలయాలు కొంత కాలం శనివారం కూడా సేవలు అందిస్తాయని విశాఖపట్నం, విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాల ఆఫీసర్ విశ్వాంజలి ఎం.గైక్వాడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుంచి ప్రతి శనివారం విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, భీమవరంలోని పాస్‌పోర్టు జారీ కేంద్రాలు పనిచేస్తాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ప్రతి శనివారం 2200 స్లాట్లను రిలీజ్ చేస్తామని తెలిపారు. ఈ నెల 26 ఉదయం నుంచి ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. కొత్త దరఖాస్తుదారులతో పాటు, రీషెడ్యూల్ కేటగిరీలో పాస్‌పోర్టులు కావాల్సిన వారు, అపాయింట్‌మెంట్ తేదీలను మార్చుకోవాలనుకునేవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. సాధారణ పనిదినాల్లో(సోమవారం నుంచి శుక్రవారం వరకు) కూడా అదనపు స్లాట్లను ఏర్పాటు చేస్తామన్నారు. విజయవాడ, తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ప్రతి రోజు అదనంగా 50 స్లాట్‌లను రిలీజ్ చేయనున్నామన్నారు. తత్కాల్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న వారు అవసరమైన డాక్యుమెంట్లను పాస్‌పోర్టు సేవా ప్రాజెక్టు పోర్టల్‌లో సమర్పించి రీషెడ్యూల్‌ను నివారించవచ్చన్నారు.

ఆర్టీసీ టెంపుల్ టూరిజం

- ప్రతి పౌర్ణమికి అరుణాచల యాత్ర
- కాణిపాకం, శ్రీపురం, కంచి, శ్రీకాళహస్తిల దర్శనం
- ప్యాకేజీ ధర ఒక్కొక్కరికి రూ.4,000
- వారాంతంలో పూరీ, భువనేశ్వర్‌లకు స్పెషల్స్
- సంవత్సరం పొడవునా నడపాలని నిర్ణయం
- ఆదాయం పెంపు కోసం ఆర్టీసీ కొత్తమార్గాల అన్వేషణ



టెంపుల్ టూరిజం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు



అరుణాచలం ఆలయ వ్యూ

సాక్షి, విశాఖపట్నం : ఆదాయం పెంపు కోసం ఆర్టీసీ కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. ప్రయాణికుల ద్వారా వచ్చే రాబడికంటే దానికయ్యే ఖర్చే అధికంగా ఉంటోంది. అయినప్పటికీ సేవా దృక్పథంతో ప్రజల కోసం బస్సులను నడుపుతోంది. దీంతో ఇతర ఆదాయ మార్గాలపై దృష్టి సారిస్తోంది. ఇప్పటికే లాజిస్టిక్స్ ద్వారా ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరుతోంది. కొత్తగా కార్గోలో డోర్ డెలివరీ, పికప్ సదుపాయాలను కూడా ప్రవేశపెట్టింది. దీనికి వినియోగదార్ల నుంచి ఆదరణ బాగుంది. ఈ నేపథ్యంలో సరికొత్తగా టెంపుల్ టూరిజంపై ఫోకస్ పెట్టింది. ఇందులోభాగంగా విశాఖపట్నం నుంచి తమిళనాడులోని అరుణాచలం, పొరుగున ఒడిశాలో ఉన్న పూరీ సహా మరికొన్ని పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. ఇప్పటికే నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి అరుణాచలానికి 120 వరకు ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. ప్రతి పౌర్ణమికి అరుణాచల గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తుతుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని విశాఖ (ద్వారకా బస్‌స్టేషన్) నుంచి అరుణాచలానికి ప్రతి పౌర్ణమికి ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. మే 5 నాటి పౌర్ణమికి 3వ తేదీన ఇక్కడ నుంచి ఈ బస్సులు బయలుదేరేలా ప్రణాళిక రూపొందించామన్నారు. అరుణాచలం వెళ్లేటప్పుడే కాణిపాకం, శ్రీపురం, కంచి, శ్రీకాళహస్తి దేవాలయాలను కూడా దర్శించుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. పౌర్ణమి దర్శనం అయ్యాక ఏడో తేదీన విశాఖలో చేరుస్తామన్నారు. సూపర్ లగ్జరీ సర్వీసుకు రూ.4,000, ఇంద్ర ఏసీ సర్వీసుకు రూ.5,000 చొప్పున ఒక్కొక్కరికి టికెట్టు ధర నిర్ణయించామన్నారు. ఈ యాత్రకు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునే వీలు కల్పించామన్నారు.

పూరీ, భువనేశ్వర్‌కు కూడా..

మరోవైపు పొరుగున ఒడిశాలోని కొన్ని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు కూడా స్పెషల్ ప్యాకేజీతో బస్సులను నడపనున్నట్టు ఈడీ రవికుమార్ తెలిపారు. పూరీలోని జగన్నాథస్వామి, భువనేశ్వర్‌లోని లింగరాజస్వామి, కోణార్క్ సూర్య దేవాలయం, చిలక సరస్సుల సందర్శనకు ప్రతి వారాంతం (శనివారం)లో వీటిని నడుపుతామన్నారు. ఈనెల 29 నుంచి ఈ బస్సులను ప్రారంభిస్తామన్నారు. ఈ ప్యాకేజీలో (సూపర్ లగ్జరీ) టికెట్టు ధర రూ.2,350గా నిర్ణయించామని చెప్పారు. డిమాండ్‌ను బట్టి ఏసీ సర్వీసులను కూడా ప్రవేశపెడతామన్నారు. అరుణాచలంతో పాటు ఒడిశా పుణ్యక్షేత్రాలకు ఏడాది పొడవునా ఈ టెంపుల్ టూరిజం బస్సులు నడుపుతామని తెలిపారు. మీడియా సమావేశంలో ఆర్టీసీ డీపీటీవో బలిజి అప్పలనాయుడు, డిప్యూటీ సీటీఎం జి.సత్యనారాయణ, విశాఖ డిపో మేనేజర్ గంగాధరరావులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో రోగులు, సహాయకులకు

అధిక ప్రాధాన్యం



సత్రం ఆవరణలో శిలా ఫలకం ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, కలెక్టర్ మల్లికార్జున, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఇస్కాన్ ప్రతినిధులు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- రూ.50 లక్షలతో ఆధునికీకరించిన 200 పడకల సత్రం ప్రారంభం



సత్రం ఆవరణలో మొక్క నాటుతున్న వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

మహారాణిపేట(విశాఖ దక్షిణ): కేజీహెచ్‌లో వైద్యం కోసం వచ్చే రోగులతో పాటు వారి సహాయకులకు అధిక ప్రాధాన్యమిస్తూ మెరుగైన వసతులు కల్పిస్తున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని తెలిపారు. కేజీహెచ్‌లో రూ.50 లక్షల నిధులతో ఆధునికీకరించిన 200 పడకల సత్రాన్ని మంత్రి విడదల రజిని మంగళవారం ప్రారంభించారు. ఇందులోని వసతి గదులు, బెడ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ సీఎస్ఆర్ ఫండ్ నుంచి రూ.30 లక్షలు, ఇస్కాన్ సంస్థ అందించిన మరో రూ.20 లక్షలతో భవనాన్ని ఆధునికీకరించామన్నారు. ఈ సత్రంలో 8 బ్లాకుల్లో ఒక్కొక్క బ్లాక్‌లో 25 బెడ్స్ ఏర్పాటు చేశామన్నారు. సత్రం నిర్వహణ బాధ్యతలు ఇస్కాన్ సంస్థ చేపడుతుందన్నారు. ఒక్కొక్క బెడ్ నుంచి రూ.50 సాధారణ రుసుం వసూలు చేసి మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందిస్తారని మంత్రి వివరించారు. అధునాతన వైద్య పరికరాల కోసం రూ.2.66 కోట్లు, 10 అంబులెన్స్‌ల కోసం రూ.2.5 కోట్లు ఇవ్వడానికి హెచ్‌పీసీఎల్ సంస్థ కేజీహెచ్‌తో ఒప్పందం చేసుకుందని ఆమె తెలిపారు. అంతకు ముందు మంత్రి రజిని సత్రం ఆవరణలో కలెక్టర్ ఎ.మల్లికార్జున, మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నాడు–నేడు కింద సత్రంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, ఏపీ ఎంఐడీసీ, ఈఈడీఏ నాయుడు, డీఈ మన్మథరావు, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్న, సూరిన రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరుడే ఆదర్శం



మాట్లాడుతున్న స్వరూపానందేంద్ర సరస్వతి. చిత్రంలో స్వాత్మానందేంద్ర సరస్వతి,ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- ఘనంగా ఆది శంకరాచార్యుల జయంతి



కలెక్టర్ మల్లికార్జునతో మాట్లాడుతున్న స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం : యావత్ విశ్వమంతటికీ ఆదిశంకరాచార్యులు మాత్రమే జగద్గురువులవుతారని విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి స్పష్టం చేశారు. శూన్య మతాలు విస్తరిస్తూ నాస్తిక వాదనలు పెరుగుతున్న సమయంలో ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు, భగవద్గీత, వేదాంత ప్రచారం ద్వారా సనాతన ధర్మాన్ని శంకరాచార్య నిలబెట్టారని గుర్తుచేశారు. శంకర జయంతి వేడుకలను మంగళవారం విశాఖ శ్రీ శారదాపీఠంలో ఘనంగా నిర్వహించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతితో కలిసి ఆదిశంకరుల ప్రతిమకు స్వరూపానందేంద్ర సరస్వతి విశేష అభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడారు. విగ్రహారాధనకు అతీతంగా పరమాత్మ స్వరూపానాన్ని పరిశోధనాత్మక ధోరణిలో తెలియజేసిన ఏకైక గురువు జగద్గురు ఆదిశంకరాచార్యులే అని తెలిపారు. గొప్ప గురు సంప్రదాయం విశాఖ శ్రీ శారదాపీఠం సొంతమన్నారు.

విశేషంగా వేదసభ : వేడుకల్లో భాగంగా శంకరులను స్మరిస్తూ విశిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణం, విష్ణుసహస్రనామ పారాయణాన్ని విశేషంగా నిర్వహించారు. వందలాదిమంది మహిళలు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. శంకాచార్యుల వారిని స్మరిస్తూ వేద సభను నిర్వహించారు. వేద పండితులకు ఈసందర్భంగా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి దక్షిణ అందజేశారు. చతుర్వేదాలకు చెందిన పండితులు ఈసభలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శారదా సుబ్రహ్మణ్యయన్ బృందం శంకరాచార్య గేయాలను ఆలపించారు.

సీతా ఆధ్వర్యంలో ఆలయ సంస్కృతిపై సదస్సు


ఆంధ్రప్రదేశ్ దేవాలయ పరిపాలనా సంస్థ (సీతా) ఆలయాల కార్యనిర్వహణాధికారులకు సదస్సు ఏర్పాటు చేసింది. భారతీయ సనాతన సంప్రదాయం–ఆలయ సంస్కృతి పేరుతో జరిగిన సదస్సులో పలు దేవస్థానాలకు చెందిన ఈవోలు పాల్గొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి జీఎస్.కృష్ణమూర్తి ప్రసంగించారు. ఈసదస్సులో కలెక్టర్ మల్లికార్జున, ఏయూ మాజీ వీసీ ప్రసన్నకుమార్, దేవదాయశాఖ సంయుక్త కమిషనర్ ఆజాద్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఆర్జేసీ సురేష్‌బాబు, డీసీ విజయర్‌రాజ్, అన్నమాచార్య పీడీ విభీషణ్‌శర్మ, సీతా డైరెక్టర్ రామచంద్రా, అర్చక అకాడమీ డైరెక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు వేతనాల మంజూరు

విశాఖ విద్య: సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగుల వేతనాలకు నిధులు విడుదలయ్యాయి. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల వరకు వేతనాలతో పాటు, పారితోషకాలకు సైతం నిధులు మంజూరు చేస్తూ ఎస్ఎస్ఏ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ స్టాఫ్, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న వారికి సైతం వేతనాలు చెల్లించేలా నిధులు కేటాయించారు. విశాఖ జిల్లాకు రూ.2.42 కోట్లు, అనకాపల్లికి రూ.6.39 కోట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు రూ.5.02 కోట్లు విడుదల చేశారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించి, నివేదికలు అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టీడీ పీ ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం ముగిసినా వేతనాలు మంజూరు కాని పరిస్థితి ఉండేది. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నారు. 2022–23 విద్యా సంవత్సరం ఈ నెల 30వ తేదీతో ముగిస్తుండగా, ముందుగానే వేతనాలకు సంబంధించిన నిధులు విడుదల చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

హౌస్ కమిటీ పట్టాలకు హక్కులు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- గాజువాకలో 7,027 మందికి చేకూరనున్న లబ్ధి
- పట్టాల్లో తప్పుల సవరణకు చర్యలు
- నేటి నుంచి నెల రోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ



గాజువాక : గాజువాక హౌస్ కమిటీ బాధితులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. జీవో నంబర్ 301 ప్రకారం పొందిన క్రమబద్ధీకరణ పట్టాలకు సర్వ హక్కులను కల్పించేలా ఉత్తర్వులు జారీ చేసింది. పట్టాలకు హక్కులు కల్పిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో జీవో నంబర్ 71ను జారీ చేసిన ప్రభుత్వం ..తాజాగా విధి విధానాలను విడుదల చేసింది.

- ఇప్పటికే జీవో నంబర్ 301 ప్రకారం పట్టాలు పొందిన వారికి తమ ఆస్తిపై సర్వ హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నారు. గాజువాక హౌస్ కమిటీ పరిధిలో 7,027 మంది ఈ పట్టాలు పొందిన విషయం తెలిసిందే. గతంలో ప్రభుత్వం ఈ పట్టాలకు ఎటువంటి హక్కులు కల్పించకపోవడంతో అవి వృథాగా మిగిలిపోయాయి. ఈ విషయాన్ని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యకు మోక్షం కలిగింది.
- డబ్బులు చెల్లించి పట్టాలు పొందలేని వారి సమస్యను కూడా పరిష్కరించాలని అధికారులు నిర్ణయించారు. పట్టాల కోసం పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించినవారు 1300 మంది ఉన్నట్టు గాజువాక మండల రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇప్పుడు వారందరికీ సర్వ హక్కులతో కూడిన రిజిస్ట్రేషన్లను చేసి ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు.
- పట్టాల్లో దొర్లిన తప్పులను సరిదిద్దేందుకు బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. అర్జీదారులు తమ దగ్గర్లో ఉన్న ఏ సచివాలయం నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చని గాజువాక తహసీల్దార్ ఎం.పాల్ కిరణ్ తెలిపారు. దీని కోసం ప్రతి సచివాలయానికి జిల్లా అధికారులు ఒక లాగిన్‌ను కేటాయించారు. దరఖాస్తులను సచివాలయాల్లో ఉచితంగా పొందవచ్చు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 25వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు.
- రోడ్డు మార్జిన్లు, చెరువులు, శ్మశానాలు వంటి అభ్యంతరకరమైన ప్రదేశాల్లో పట్టాలు పొందినప్పటికీ అలాంటి వాటికి రిజిస్ట్రేషన్లు ఉండవని తెలిపారు. ఈ విధమైన పట్టాలు గాజువాకలో హౌస్ కమిటీలో 500కు పైగా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

జీవో 388 పట్టాలకు హక్కు పత్రాలు

గతంలో జీవో నంబర్ 388 ప్రకారం ప్రభుత్వ భూముల్లో పట్టాలు పొందినవారికి కూడా అన్ని హక్కులతో కూడిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను జారీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. దీని కోసం ఉద్దేశించిన జీవో 72 ప్రకారం సర్వ హక్కులతో కూడిన డాక్యుమెంట్లను పట్టాదారులకు అందజేస్తారు. ఈ జీవో ప్రకారం గాజువాక మండలంలో 945 మందికి లబ్ధి చేకూరనున్నట్టు అధికారులు తెలిపారు. పట్టాల్లో తప్పులుంటే సరిదిద్దుకోవడానికి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వంద చదరపు గజాల్లోపు స్థలాల్లో పట్టాలు పొందిన బీపీఎల్ కుటుంబాలకు ఉచితంగాను, ఏపీఎల్ కుటుంబాలకు 2013 నాటి మార్కెట్ విలువ ప్రకారం 7.5 శాతం రుసుం, 101 నుంచి 250 చదరపు గజాల స్థలానికి 15 శాతం, 251 నుంచి 500 చదరపు గజాల వరకు 30 శాతం రుసుంతో పట్టాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

చందనోత్సవం లోపాలపై జేసీ విచారణ

నాలుగు రోజుల్లో నివేదిక



టికెట్ల జారీకి సంబంధించి రికార్డులు పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథం

సింహాచలం : ఈనెల 23న జరిగిన చందనోత్సవం నిర్వహణలో చోటుచేసుకున్న వైఫల్యాలపై జాయింట్ కలెక్టర్ విశ్వనాథ్ మంగళవారం సాయంత్రం దేవస్థానం ఈవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. చందనోత్సవంలో వైఫల్యాలపై విచారణ చేయాల్సిందిగా జేసీ విశ్వనాథ్‌కు కలెక్టర్ మల్లికార్జున బాధ్యతలు అప్పగించారు. ఆయన సూచనల మేరకు మంగళవారం దేవస్థానం పరిపాలనా కార్యాలయంలోను, ఈవో చాంబర్‌లోని ఆయన పలు అంశాలపై విచారణ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చందనోత్సవంలో ఎక్కెడెక్కడ లోపాలు జరిగాయో విచారణ చేస్తున్నామన్నారు. టికెట్లు, వెహికల్ పాస్‌లు జారీ, మంచినీరు కేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటులో ఎక్కెడెక్కడ వైఫల్యాలు జరిగాయో ప్రాథమికంగా విచారణ జరిపామన్నారు. చందనోత్సవానికి సంబంధించి దేవస్థానం అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్, ఎన్ని టికెట్లు జారీ చేశారు, ఎన్ని టికెట్లు ఇష్యూ చేయలేదో, ఎన్ని బ్లాంక్స్ ఉన్నాయో తదితర అంశాలపై విచారణ జరిపామన్నారు. సీసీటీవీ చెక్‌చేసి పలువురుని విచారించాల్సి ఉందన్నారు. నాలుగు రోజుల్లో నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్, రమణమూర్తి, సూపరింటెండెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను విచారించారు. దేవస్థానం ఎస్‌డీసీ రామలక్ష్మి, చినగదిలి తాహసీల్దార్ రమణయ్య, జిల్లా ఇన్ఫర్మేషన్ అధికారి భాషా, ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, వీఆర్‌వో జామిరాము పాల్గొన్నారు.

క్లుప్తంగా

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు డి.మనోహర్ ఓ ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలోని కెనరా బ్యాంకు ఎదురుగా, శ్రీకృష్ణా ట్రావెల్స్ మేడ మీద ఉన్న సంస్థ కార్యాలయంలో మే 1 నుంచి జూన్ 30 వరకు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. శిక్షణ కోసం ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని, ఆసక్తి గల గృహిణులు ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80193 88999ను సంప్రదించవచ్చు.

30న సివిల్స్ టాలెంట్ టెస్ట్

బీచ్‌రోడ్డు: ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ కావాలనే లక్ష్యంగా ఉన్న పది, ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 30న టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తక్షశిల ఐఏఎస్ అకాడమీ నిర్వాహకులు జి.సాయిరాం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. ఈ ఏడాది పది, ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్ రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99652 52252, 99652 62262లో సంప్రదించవచ్చు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్, గన్నవరం–ముస్తాబాద–గుణదల సెక్షన్ పరిధిలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 29, 30 తేదీల్లో విశాఖపట్నం–గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25, 28, 29 తేదీల్లో ధన్‌బాద్–అలెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్, ఈ నెల 28న టాటానగర్–బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29న హతియా–బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25న హతియాలో బయలుదేరిన హతియా–బెంగళూరు(12835) ఎక్స్‌ప్రెస్‌లు నిడదవోలు–ఏలూరు– విజయవాడ మీదుగా కాకుండా వయా నిడదవోలు–భీమవరం టౌన్–గుడివాడ–విజయవాడ మీదుగా నడుస్తాయని వెల్లడించారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి రైల్వే శాఖకు సహకరించాలని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కోరారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఏయూ అభివృద్ధి

- తుది దశకు చేరుకున్న రూ.170 కోట్ల ప్రాజెక్టులు
- విద్యార్థులకు ఉపయుక్తంగా విభిన్న కార్యక్రమాలు
- మీడియా టూర్‌లో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి వెల్లడి



ఏయూ డిజిటల్ జోన్ భవనం



ఆధునికీకరించిన ఆడిటోరియం



మీడియా ప్రతినిధులకు ఏయూ ప్రగతిని వివరిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నాలుగేళ్లుగా అభివృద్ధి చేస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి వెల్లడించారు. సుమారు రూ.170 కోట్ల నిధులతో చేపట్టిన ప్రాజెక్టులు తుది దశకు చేరుకున్నాయన్నారు. ఈ ప్రాజెక్టులను మంగళవారం మీడియా ప్రతినిధులకు చూపించి వివరించారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ నుంచి ప్రారంభమైన మీడియా టూర్ సుమారు నాలుగు గంటలపాటు సాగింది. అనంతరం వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ గ్లోబల్ సిటిజన్లుగా యువతను తీర్చిదిద్దుతూ, భారత్‌ను విశ్వగురువుగా నిలపడానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. వర్సిటీలో క్రీడల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, హాస్టళ్ల నిర్మాణం, స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

- ఉపాధి అవకాశాలను సృష్టించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలను తీర్చిదిద్దే విధంగా 'ఎ హబ్' ఏర్పాటు చేశామన్నారు. ఐదు అంతస్తుల్లో 45 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన 'ఎ హబ్'లో 92 స్టార్టప్ కంపెనీలు పనిచేస్తున్నాయన్నారు.
- సిరిపురం వద్ద నిర్మించిన ఫార్మాహబ్–ఎలిమెంట్ సేవలు త్వరలో ప్రారంభమవుతాయని, ఇందులో నాలుగైదు ఫార్మా పరిశ్రమల భాగస్వామ్యం స్వీకరిస్తామన్నారు. రానున్న కాలంలో ఫార్మా అనుసంధానంగా వందకుపైగా స్టార్టప్‌లు వచ్చే అవకాశాలు ఉన్నాయని, భవిష్యత్‌లో ఏయూకు అతిపెద్ద ఆర్థిక వనరుగా ఎలిమెంట్ నిలుస్తుందన్నారు.
- ఎంఎల్ఆర్ విభాగంలో అవంతి ఫౌండేషన్ సమకూర్చిన రూ.12 కోట్లతో వెట్లాయబ్, ఇతర మౌలిక వసతులు అభివృద్ధి చేశామని వీసీ వివరించారు.
- ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం వద్ద నూతనంగా నిర్మించిన డిజిటల్ జోన్‌లో 10 స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, సమావేశ మందిరాలు, 650 కంప్యూటర్లతో ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు.
- కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఏర్పాటు చేసిన నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనితీరు, ప్రగతి వివరించారు.
- డ్రోన్ టెక్నాలజీపై ఓ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్ రూపకల్పన, వినియోగం, తయారీ వంటి అంశాలపై యువతకు ఈ కేంద్రం శిక్షణ అందిస్తుందని, ఏయూ హెలిప్యాడ్ గ్రౌండ్‌కు చేరువలో ఈ కేంద్రం ఉందన్నారు.
- దాతలు, వర్సిటీ నిధులతో కె.వి.గోపాలస్వామి ఆడిటోరియంనకు పూర్వ వైభవం తీసుకొస్తున్నట్లు వివరించారు. ఇంజినీరింగ్ కళాశాలలో అభివృద్ధి చేసిన అంబేడ్కర్ ఆడిటోరియంను సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఉచితంగా అందిస్తామన్నారు.
- శివాజీపాలెంలో నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనం, పూర్వవిద్యార్థుల సహకారంతో ఆలుమ్ని హాస్టల్ భవనం, రూసా నిధులతో మెటా–హెచ్ హాస్టల్, ఫార్మసీ విద్యార్థినుల హాస్టల్ నిర్మించినట్లు చెప్పారు. సమత, మమత న్యాయ కళాశాల హాస్టళ్లు, నాగార్జున హాస్టల్, శాతవాహన హాస్టళ్లను ఆధునీకరించామన్నారు.
- ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ పనితీరును వివరించారు. ఏయూలో నూతనంగా ముగ్గురు ప్లేస్‌మెంట్ అధికారులను నియమించి, ఉపాధి కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు.
- త్వరలో సైన్స్, ఆర్ట్స్, న్యాయ, ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలల పరిధిలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో నియామక పత్రాలు అందిస్తామన్నారు.
- మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్‌పి ఎల్‌పీజీ హాస్టల్ భవనాన్ని సీఎస్సార్ నిధులు నిర్మించినట్లు చెప్పారు.
- ఏయూ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ త్వరలో పెద్ద ఎత్తున మొక్కల పెంపకం కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.
- ఏయూ 98వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 26 నుంచి రెండు వారాలు విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. 2025లో జరిగే వర్సిటీ శతాబ్ది ఉత్సవాలకు ప్రధానమంత్రి మోదీని ఆహ్వానించామన్నారు.
- వర్సిటీలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తామని వీసీ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విద్యార్థులు ఉపయుక్తంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఇటీవల గవర్నర్‌కు ఏయూ ప్రగతిని వివరించామని, త్వరలో ఆయన వర్సిటీని సందర్శించే అవకాశం ఉందన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, మీడియా రిలేషన్స్ డైరెక్టర్ ఆచార్య చల్లా రామకృష్ణ, అన్ని విభాగాల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విధులకు వెళ్తూ.. అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో నర్సు దుర్మరణం
- కంబాలకొండ వద్ద హైవేపై ఘటన



సునీత(ఫైల్)

ఆరిలోవ: జాతీయ రహదారిపై కంబాలకొండ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందింది. ఈ ఘటన పలువురిని కలచివేసింది. ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలివీ.. దొండపర్తికి చెందిన సారిక సునీత(29) తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. మధురవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. విధుల్లో భాగంగా మంగళవారం దొండపర్తి నుంచి మధురవాడకు తన ద్విచక్రవాహనంపై బయలుదేరింది. డెయిరీఫాం దాటి ఎండాడ వైపు వెళ్తోంది. కంబాలకొండ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో.. వెనకనే వస్తున్న లారీ చక్రాల కింద పడిపోయింది. ఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందింది. తల భాగం, శరీర భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. దీంతో హైవేపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ ఎస్ఐ కుమార్, సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. శాంతి భద్రతల ఎస్ఐ అనీల్ ఘటనా స్థలికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. పోస్టుమార్టం కోసం సునీత మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఆమెకు వివాహం కాలేదు. నర్సుగా పని చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడు ఉంటోంది. సునీత అకాల మృతితో ఆ కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. సునీత సోదరుడు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్టు తెలిసింది. సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

సీపీఎం నాయకుడు కృష్ణమూర్తికి నివాళి



కృష్ణమూర్తి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రాఘవులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతానికి చెందిన సీపీఎం నాయకుడు వి.కృష్ణమూర్తికి ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు నివాళి అర్పించారు. కృష్ణమూర్తి ఇటీవల గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే.

ఈ విషయం తెలుసుకున్న రాఘవులు మంగళవారం టి.ఐ.సి పాయింట్ దరి క్రాంతినగర్‌లోని కృష్ణమూర్తి నివాసానికి చేరుకున్నారు.ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా కృష్ణమూర్తి చిత్ర పటానికి నివాళులర్పించారు. కృష్ణమూర్తి భార్య అన్నపూర్ణ, పిల్లలను పలకరించి సానుభూతి తెలిపారు. కృష్ణమూర్తి పార్టీకి ఎనలేని సేవలందించారని, పేదల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. ఆరిలోవ కాలనీ ఏర్పడిన తర్వాత కృష్ణమూర్తితో కలసి పలు పోరాటాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఆరిలోవ జోన్ నాయకులు నరేంద్రకుమార్, సూర్యమణి, రంగమ్మ, సత్యనారాయణ, తులసీరావు పాల్గొన్నారు.

డబ్ల్యూటీసీ ఫైనల్‌లో వికెట్ల వెనుక మనోడే

విదేశీ గడ్డపై తొలిసారి ఆడనున్న భరత్!

విశాఖ స్పోర్ట్స్: ప్రపంచ టెస్ట్ క్రికెట్ చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) టైటిల్ పోరులో భారత్ జట్టు వికెట్ కీపర్‌గా విశాఖకు చెందిన కె.ఎస్.భరత్ ఎంపికయ్యాడు. ప్రస్తుత సీజన్‌లో తొలిసారిగా టెస్ట్ క్రికెట్‌లో ఆరంగేట్రం చేసిన ఈ 30 ఏళ్ల కీపర్ బ్యాటర్ బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా నాలుగు టెస్టులు ఆడాడు. ఇవన్నీ భారత్‌లోనే జరిగాయి. కానీ విదేశీ గడ్డపై జరగనున్న ఈ చాంపియన్‌షిప్‌లో ఆడేందుకు సెకండ్ ఫ్రంట్‌లైన్ వికెట్‌కీపర్‌గా ఉన్న భరత్‌కు అనూహ్యంగా అవకాశం అందివచ్చింది. పంత్ గాయపడి అందుబాటులో లేకపోవడంతో బీసీసీఐ మంగళవారం ప్రకటించిన భారత్ 15వ మెంబర్ స్క్వాడ్‌లో వికెట్‌కీపర్‌గా అవకాశం దక్కింది. అయితే జట్టులో మరో వికెట్‌కీపర్ బ్యాటర్ కె.ఎల్.రాహుల్ ఉన్నా.. వికెట్ల వెనుక భరతే నిలిచే అవకాశాలు ఉన్నాయి. లండన్‌లో జూన్ 7 నుంచి 11వ తేదీ వరకు జరిగే టైటిల్ పోరులో ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది.

భారత్ వేదికగా బోర్డర్ గవాస్కర్ సిరీస్ ఈ ఏడాది జనవరిలో ప్రారంభమైంది. మొదటి టెస్ట్‌లో భరత్ తొలి స్టంపౌట్‌గా లబుషేన్‌ను వెనక్కి పంపాడు. సిరీస్‌లో భాగంగా నాలుగు మ్యాచ్‌ల్లో తొలి టెస్ట్‌లో ఓ స్టంపౌట్, ఓ క్యాచ్ పట్టిన భరత్.. మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో ఆరు క్యాచ్‌లు పట్టాడు. నాలుగో టెస్ట్‌లో 44 పరుగుల కెరీర్ బెస్ట్ స్కోర్‌తో మొత్తంగా 101 పరుగులు చేశాడు. ఆరో స్థానంలో వచ్చి 67, ఏడో స్థానంలో వచ్చి 26, ఎనిమిదో స్థానంలో వచ్చి 8 పరుగులు చేశాడు.

సాగర్ మిత్రల భర్తీకి దరఖాస్తులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద జిల్లా మత్స్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో 15 మంది సాగర్ మిత్రల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిషరీస్‌లో పాలిటెక్నిక్ డిప్లమో, బీఎస్సీ(ఫిషరీస్, సైన్స్/మెరైన్ బయాలజీ/జువాలజీ) విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. జీతం నెలకు రూ.10 వేలు, పనితీరు ఆధారంగా అదనపు ప్రోత్సాహకం కింద నెలకు మరో రూ.5వేలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా మత్స్యశాఖ సంయుక్త సంచాలకురాలు, ఫిషింగ్ హార్బర్, విశాఖపట్నం అనే చిరునామాకు పంపాలని కలెక్టర్ కోరారు.

13 కరోనా కేసుల నమోదు

మహారాణిపేట: విశాఖలో మంగళవారం 13 కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 293 మందికి పరీక్షలు నిర్వహించగా 13 మందికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 47కి చేరింది. ఆరుగురు డిశ్చార్జ్ అయ్యారు. 47 మంది చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

జగనన్న వసతి దీవెనకు వేళాయె..!

- విశాఖ జిల్లాలో 43,938 మందికి ప్రయోజనం
- జిల్లాకు రూ.41.17 కోట్లు మంజూరు
- నేడు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు
- పేద విద్యార్థుల చదువులకు భరోసా



వసతి దీవెన అందుకోనున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు

విశాఖ విద్య: జగనన్న వసతి దీవెన పథకం అందుకునేందుకు సమయం ఆసన్నమైంది. విశాఖ జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, ప్రొఫెషనల్ కోర్సులతో పాటు, డిగ్రీ ఆపై చదువులు సాగిస్తున్న 43,838 మంది విద్యార్థులు వసతి దీవెన అందుకోనున్నారు. జిల్లాకు రూ.41,17,45,000లను ప్రభుత్వం కేటాయించింది. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించిన మరుక్షణమే, వసతిదీవెన డబ్బులు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ కానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రసంగాన్ని వీక్షించేలా విశాఖ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో తగిన ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు. అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న వసతి దీవెన డబ్బులు జమ అయ్యేలా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ డీవీ రమణ మూర్తి దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలకనుగుణంగా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేశామని జాయింట్ డైరెక్టర్ రమణ మూర్తి తెలిపారు.

ఉన్నత చదువులకు భరోసా : నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసాగా నిలిచేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్రమం తప్పకుండా నిధులు కేటాయిస్తోంది. కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజులతో పాటు, విద్యార్థులకు చేయూతగా నిలిచేలా వసతి దీవెన కూడా అందిస్తోంది. ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఏడాదికి రూ.10 వేలు, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న వారికి రూ.20 వేలు చొప్పున మంజూరు చేస్తోంది. కాలేజీ పని దినాల్లో 75 శాతం హాజరు ఉండాలనే నిబంధన విధించడంతో విద్యా, వసతి దీవెన పథకం అందుకునేందుకు విద్యార్థులు కాలేజీల బాటపడుతున్నారు.

తల్లుల ఖాతాల్లోకి డబ్బులు : ప్రభుత్వ పథకాల అమల్లో పారదర్శకతకు పెద్ద పీట వేస్తున్న క్రమంలో విద్యా, వసతి దీవెన డబ్బులను నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. విద్యార్థులు తల్లులు కాలేజీలకు వెళ్లి ఫీజు చెల్లించటం ద్వారా, తమబిడ్డల చదువులు ఎలా సాగుతున్నాయనేది తెలుసుకునే అవకాశం ఉంటుందనే ఉన్నతాశయంతో ప్రభుత్వం ఇటువంటి ఏర్పాట్లు చేసింది. 2022–23 విద్యా సంవత్సరంనకు ఇటీవలే విద్యా దీవెన డబ్బులు మంజూరు కాగా, బుధవారం నాడు వసతి దీవెన అందుకోనుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దీవెనలు అందుకోనున్న విద్యార్థులు ఇలా

సామాజిక వర్గం	విద్యార్థుల సంఖ్య	జమ కానున్న నగదు(రూ.లలో)
బీసీ	2,185	30,9,80,000
ఈబీసీ	4,530	4,30,87,500
కాపు	1,394	1,32,25,000
ఎస్సీ	4,238	3,95,00,000
ఎస్టీ	168	15,52,500
క్రిస్టియన్ మైనార్టీ	216	20,72,500
ముస్లిం మైనార్టీ	1,207	1,13,27,500
మొత్తం	43,938	41,17,45,000

బిల్డర్‌కు ఐదేళ్ల జైలు, జరిమానా

విశాఖ లీగల్: వినియోగదారులను మోసం చేసిన బిల్డర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ న్యాయమూర్తి జె.పద్మావతి మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో వివిధ నేరాల్లో అదనంగా రెండేళ్ల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.శేషుబాబు అందించిన వివరాలివీ.. ఒకటో నిందితుడు పట్టపు ఆనంద్ అరుణ్ కుమార్ కూర్మన్నపాలెంలో ఉంటున్నాడు. వృత్తిరీత్యా బిల్డర్. కూర్మన్నపాలెంలో 2013లో అక్షిత హైట్స్ పేరుతో ఓ అపార్టుమెంట్ నిర్మించాడు. ఇందులో ఫ్లాట్ల అమ్మకానికి ప్రకటనలు జారీ చేశారు. ఆకర్షితులైన కొందరు ఫ్లాట్లు కొనడానికి వచ్చారు. మరో నిందితుడు అరుణ్ కుమార్, నాల్గో నిందితుడు డి.చంద్రశేఖర్ సహకారంతో ఒకే ఫ్లాట్‌ను ఐదుగురికి విక్రయించాడు. కొనుగోలుదారులందరూ స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రుణం తీసుకున్నారు. బ్యాంక్ అధికారులు రుణం చెల్లించమని ఒత్తిడి తేవడంతో అసలు విషయం బయటపడింది. ఈ ఫ్లాట్ను తొలుత కొనుగోలు చేసిన వ్యక్తి సొమ్ము చెల్లించాడు. మిగిలిన వారు చెల్లించకపోవడంతో అనుమానం వచ్చి బ్యాంకు అధికారులు సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన నాలుగో పట్టణ పోలీసులు కేసును విచారించారు. కేసులో ఆరుగురు నిందితులు ఉన్నారు. రెండో నిందితుడు చనిపోయాడు. 3, 5, 6 వ్యక్తులపై నేరం రుజువు కాలేదని న్యాయవాది తెలిపారు. కేసులో నాలుగో నిందితుడు చంద్రశేఖర్ బ్యాంకును మోసం చేసి ఫోర్జరీ డాక్యుమెంట్లతో రుణం పొందాడు. కేసు విచారణ జరిపిన న్యాయమూర్తి ఒకటో, నాలుగు నిందితుడికి శిక్ష విధించారు.

గంజాయితో చిక్కిన ఇంజినీరింగ్ విద్యార్థులు

ఆరిలోవ: భవిష్యత్ ఇంజినీర్లుగా మారాల్సిన ముగ్గురు విద్యార్థులు గంజాయి విక్రయిస్తూ.. ఆరిలోవ పోలీసులకు చిక్కారు. సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలివీ.. ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు, పాలిటెక్నిక్ చేసి ఖాళీగా ఉన్న మరో విద్యార్థి జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ బీచ్‌రోడ్‌లో మంగళవారం గంజాయి విక్రయిస్తున్నారు. ఈ సమాచారంతో పోలీసులు బీచ్‌రోడ్‌లో తనిఖీలు చేపట్టి.. ముగ్గురు విద్యార్థులను పట్టుకున్నారు. విక్రయించడానికి సిద్ధంగా ఉన్న ఐదు కిలోల గంజాయిని వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ సబ్ రీజినల్ అధికారి శ్యామ్ సుందర్ నిట్టాల్ తెలిపారు. బజాజ్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 30 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, టెలిమేనేజర్, టెలి ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 20–28 ఏళ్ల కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.inలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పోస్టర్లు అతికిస్తే చర్యలు తప్పవు



కాన్వెంట్ జంక్షన్ వద్ద అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్

దాబాగార్డెన్స్: అనుమతి లేకుండా నగరంలో విచ్చలవిడిగా పోస్టర్లు అతికిస్తే చర్యలు తప్పవని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ హెచ్చరించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం జోన్–3, 5లో లలితాకాలనీ, దొండపర్తి, రైల్వే న్యూకాలనీ, డైమండ్‌పార్క్, కంచరపాలెం, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర గోడలపై పోస్టర్లు అతికించే వారిపై నిఘా ఉంచి.. వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు ఉదయం 5.30 గంటలకు మస్టర్ అయిన వెంటనే 6 గంటలకు విధుల్లో ఉండాలని స్పష్టం చేశారు. క్లాప్ వాహనాలతో పాటు ఇతర చెత్తను తరలించే వాహన సిబ్బంది ఆరు గంటల నుంచే విధుల్లో ఉండాలన్నారు. రాత్రి పూట దుకాణం మూసిన తర్వాత దుకాణదారులు చెత్తను రోడ్లపై వేస్తున్నారని, ఆ చెత్తను జీవీఎంసీ వాహనాలకు అందించేలా అవగాహన కల్పించాలన్నారు. తాటిచెట్లపాలెం, రైల్వే ఆశీర్వాద్ కమ్యూనిటీ హాల్, శంకరమఠం, జ్ఞానాపురం, ఎర్నిమాంబ మందిరం, డైమండ్ పార్క్ తదితర ప్రాంతాల్లో చెత్త కుప్పలు అధికంగా కనిపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.

రైల్వే సిగ్నల్ కేబుల్స్ చోరీ

- ముగ్గురు రైల్వే ఉద్యోగులు, స్క్రాప్‌షాప్ నిర్వాహకుడి అరెస్ట్
- పరారీలో మరో రైల్వే ఉద్యోగి

విజయనగరం క్రైమ్: కొంతకాలంగా రైల్వే సిగ్నల్ కేబుల్స్ చోరీ చేస్తున్న దొంగలు దొరికారు. వీరిలో నలుగురు రైల్వే ఉద్యోగులు కాగా.. ఒకరు స్క్రాప్ దుకాణం నిర్వాహకుడు అని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్ తెలిపారు. ఈ కేసు వివరాలను మంగళవారం ఆయన వివరించారు. అలమండ రైల్వేస్టేషన్ పరిసరాల్లో రైల్వే సిగ్నల్ కేబుల్స్ కుప్పలు తెప్పలుగా ఉంటాయి. వీటిపై నలుగురు రైల్వే ఉద్యోగుల కన్నుపడింది. స్థానికంగా ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఆ నలుగురు ఎప్పటికప్పుడు కారులో కేబుల్స్ ఎక్కించుకుని.. వాటిని కాల్చి అందులో ఉన్న రాగిని పెందుర్తి వద్ద ఉన్న స్క్రాప్ షాపులో విక్రయించేవారు. అలా వచ్చిన డబ్బులను సమానంగా పంచుకునేవారు. కొంతకాలంగా కేబుల్స్ చోరీ జరుగుతుందన్న ఫిర్యాదు మేరకు విజయనగరం ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్, సిబ్బంది కలిసి నిఘా పెట్టారు. రైల్వే ఉద్యోగులైన పి.లక్ష్మణరావు, ఎం.సాయికుమార్, బి.దీపక్, స్క్రాప్ షాప్ నిర్వాహకుడు ఆదిరెడ్డిలను అరెస్ట్ చేసి విజయనగరం కోర్టులో హాజరుపరిచారు. వీరికి 13 రోజుల పాటు కోర్టు రిమాండ్ విధించిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మరో ఉద్యోగి దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నట్టు చెప్పారు.